సీఎంను కలిసిన పీఏసీ చైర్మన్ గాంధీ

పీఏసీ చైర్మన్‌గా నియామకమైన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీని సీఎం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన స్పీకర్ ప్రసాద్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్, పార్టీ నేత రఘునాథ్‌రెడ్డి తదితరులున్నారు. పీఏసీ చైర్మన్‌గా నియామకమైన గాంధీ అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచారిని కలిశారు. అంతకు ముందు గాంధీ నివాసంలో నియోజకవర్గంలోని పలు డివిజన్‌లకు చెందిన పార్టీ నేతలు, ఆయా సంఘాల ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

– మియాపూర్, సెప్టెంబర్ 11

ఎంఈఓ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 11: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈఓ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని, ఓయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ అధికారులు తెలిపారు. ఎల్ఎల్ఎం, మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, తదితర కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈనెల 24లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుంతో 28 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేదెవరు?

- కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో జడ్సీగా ఐఏఎస్ వచ్చినా మారని వ్యవస్థ..
- టీఎస్ బీపాస్ చట్టం.. అక్రమార్కులకు చుట్టం..
- అందరికీ వాటాలు.. యథేచ్ఛగా నిర్మాణాలు..

కూకట్‌పల్లి బాగ్‌అమీర్‌లో కోర్టు స్టే ఉన్నా సాగుతున్న నిర్మాణ పనులు

కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్‌లో అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ సభ్యుడు(ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 11 : కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని వసంతనగర్ కాలనీలో పలు అక్రమ నిర్మాణాలను నియంత్రించాలని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు.. మూసాపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్, డీసీకి, జడ్సీకి ఫిర్యాదు చేయడంతో పాటు.. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సైతం ఫిర్యాదులు చేశారు. 'ప్రజావాణి'లో సైతం పలు మార్లు ఫిర్యాదులు చేసినా ఆ నిర్మాణాలను ఆపడంలో జీహెచ్ఎంసీ యంత్రాంగం అంతా విఫలమైంది. సదరు నిర్మాణదారులు యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమిస్తూ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు.

■ ముంబై జాతీయ రహదారి పక్కన కూకట్‌పల్లి బాగ్‌అమీర్‌లో ప్లాట్ నంబర్ 8లో.. 500 గజాల స్థలంలో జీ ప్లస్ -ఫైవ్ అంతస్తులకు అనుమతి తీసుకున్న నిర్మాణదారుడు.. సెల్లార్ తవ్వడంతోపాటు చుట్టూరా నిబంధనల మేరకు స్థలం వదలలేదు. ఈ నిర్మాణంపై పిల్లర్ స్థాయిలోనే ఫిర్యాదులు వెళ్లాయి. ఆ నిర్మాణదారుడు కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో.. ఆర్డర్ తెచ్చుకుని నిర్మాణ పనులను కొనసాగిస్తున్నాడు. సెల్లార్ స్థాయి నుంచి మూడు శ్లాబ్‌లు వేసి.. జీహెచ్ఎంసీ యంత్రాంగానికి సవాల్ విసురుతున్నాడు.(ఈ భవనం నిర్మిస్తున్న స్థలం యాజమాన్య హక్కులపై కోర్టు పరిధిలో కేసు ఉండగా.. భవన నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారనే మరో ఫిర్యాదు కూడా ఉన్నది).

■ కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లో.. నిబంధనలు అతిక్రమిస్తూ.. భవనం నిర్మిస్తున్నాడని జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. కానీ.. నిర్మాణదారుడు నిర్మాణ పనులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాడు. అలాగే కేపీహెచ్‌బీ కాలనీలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సైతం.. ఆ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా.. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించడంలేదని వాపోతున్నారు.

ఇలా చెప్పుకుంటూ పోతే...కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో వందలాదిగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రజా పాలన అంటూ రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు కావడం.. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ ఆఫీసర్ రావడంతో.. జోన్, సర్కిళ్ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలుంటాయని భావించిన ఫిర్యాదుదారులకు, ప్రజలకు నిరాశే మిగిలింది.

టీఎస్-బీపాస్ చట్టానికి తూట్లు..

టీఎస్-బీపాస్ చట్టం అక్రమార్కులకు చుట్టంగా మారింది. కొత్త చట్టంతో అనుమతులు సులభం కాగా.. క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో పూర్తిగా విఫలమైంది. జోనల్ కమిషనర్ నేతృత్వంలోని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లోని న్యాక్ ఇంజినీర్లు అనుమతులు తీసుకుని నిర్మిస్తున్న భవనాలు.. నిబంధనలు మేరకు నిర్మిస్తున్నారా? లేదా? అని చూడకుండా అక్రమ నిర్మాణాల వద్ద బిల్డర్లు ఇచ్చే తాయిలాలకు అలవాటు పడి.. అక్రమ నిర్మాణాల వివరాలను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లకుండా చూస్తున్నారు. జడ్సీ పర్యవేక్షణలో పనిచేసే.. నోడల్ ఆఫీసర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్, చైన్‌మెన్‌లు... అక్రమ నిర్మాణాలను కూల్చే టీమ్‌లో కీలకమైన ఇంజినీరింగ్ అధికారులు అంతా కలిసి నిబంధనలు అతిక్రమించే బిల్డర్స్ ఇచ్చే తాయిలాలు పుచ్చుకుని.. వాటాలు పంచుకుంటూ.. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులును పట్టించుకోవడం లేదు. ఒకసారి కూల్చిన అక్రమ నిర్మాణ పనులు మళ్లీ యథావిధిగా కొనసాగినా.. స్థానికులు ఎవరైనా ఫిర్యాదులు చేసిననా పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలంటే మాత్రం.. బాధ్యులైన వారంతా.. బాధ్యత మాది కాదని.. ఒకరిపై మరొకరు నెపం వేస్తూ.. ఆ అక్రమ నిర్మాణం పూర్తయ్యే వరకు కాలయాపన చేస్తున్నారు. ఐఏఎస్ అధికారి(జోనల్ కమిషనర్)కి అక్రమ నిర్మాణాలపై వస్తున్న ఫిర్యాదుల పట్ల తప్పుడు సమాచారం ఇస్తూ.. అరికట్టాల్సిన అధికారులంతా అండగా నిలుస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలంటే... హైడ్రా లాంటి ఓ చట్టం రావాలని, ఇన్నాళ్లు అక్రమ నిర్మాణాలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో అక్రమ నిర్మాణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని.. అధికారుల తీరుతో విసిగిపోయిన ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఫిర్యాదుదారులు కోరుకుంటున్నారు.

అనుమతి ఇవ్వడం వరకే మా పని..

భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే.. అనుమతులు ఇవ్వడం వరకే మా పని. కొత్త చట్టం ప్రకారం అక్రమ నిర్మాణాలను కూల్చే అధికారం మాకు లేదు. క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలను గుర్తించాల్సిన బాధ్యత న్యాక్ ఇంజినీర్లది. గుర్తించిన భవనాలను జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో పనిచేసే స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం కూల్చివేస్తుంది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే జోనల్ పరిధిలో పనిచేసే నోడల్ ఆఫీసర్, ఎస్‌టీఎస్ టీమ్ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటుంది. నిబంధనలు ఉల్లఘించిన నిర్మాణాలకు చట్టపరంగా నోటీసులు జారీ చేస్తున్నాము. జోనల్ కమిషనర్, నోడల్ ఆఫీసర్ ఆదేశాలను పాటిస్తూ పని చేస్తున్నాం. నిబంధనలను అతిక్రమిస్తూ.. నిర్మించిన భవనాలపై చట్టరీత్యా చర్యలు ఉంటాయి.

– రమేశ్, టౌన్‌ప్లానింగ్, ఏపీసీ, కూకట్‌పల్లి సర్కిల్

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

లబ్ధిదారుడికి ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్

దుండిగల్, సెప్టెంబర్ 11: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌కు చెందిన ఎస్.సుధ, ఈశ్వర్‌రెడ్డి దంపతులు నిరుపేద కుటుంబానికి చెందినవారు. కాగా, సుధ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నది. చికిత్స ఖర్చులకు ఆదుకోవాల్సిందిగా బీఆర్ఎస్ నేత సాంబశివారెడ్డిని కోరగా, ఆయన ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దృష్టికి తీసువెళ్లి సీఎం సహాయనిధి నుంచి లక్ష రూపాయల ఎల్ఓసీని మంజూరు చేయించారు. ఆ పత్రాలను బుధవారం డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, రంగరాయ ప్రసాద్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నిజాంపేట్ బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్కూల్ క్రీడల్లో నేతాజీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న హైస్కూల్ కరస్పాండెంట్ చింతల మహేశ్‌కుమార్

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 11: డెక్కన్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో హైదరాబాద్ పేరిట ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్-24 ఫర్ కులికుతుబ్‌షా స్టేడియంలో జరిగిన క్రీడల్లో కుత్బుల్లాపూర్ నేతాజీ హైస్కూల్ విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రతిభను చాటారు. ఖోఖో అండర్ 17 బాలికల విభాగంలో మొదటి స్థానం, అండర్ -14 విభాగంలో మొదటి స్థానం, అండర్-11 బాలల విభాగంలో మొదటి స్థానంతోపాటు షార్ట్‌పుట్‌లో 17 ఏండ్ల బాలల విభాగంలో హిమాషుకు రెండవ స్థానం, రన్నింగ్‌లో మొదటి బహుమతిని తనూజ సాధించగా.. బాలల విభాగంలో మానవ్ భాటికి ద్వితీయ స్థానాన్ని సాధించి తమ అత్యుత్తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా పాఠశాలలో విజేతలను పాఠశాల కరస్పాండెంట్ చింతల మహేశ్‌కుమార్ అభినందించారు.

రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టాలి

తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర

కొండాపూర్, సెప్టెంబర్ 11: రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలతో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం వెంటనే సమగ్ర కుల గణన చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర సగర డిమాండ్ చేశారు. కుల గణనను మూడు నెలల్లో నిర్వహించి నివేదిక సమర్పించాలని తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం మంగళవారం ఆదేశాలు జారీ చేయడాన్ని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక, తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ తరపున స్వాగతిస్తున్నామని తెలిపారు. బీసీల లెక్కలు తేల్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కృషి అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహించాలని శేఖర్ సగర డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ముందుకు సాగాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

వెంకటేశ్వర కాలనీలో తాగునీటి నాణ్యతను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

కొండాపూర్, సెప్టెంబర్ 11 : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడంలో ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం ఆమె డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో మంచినీటి పైపులలోకి డ్రైనేజీ నీరు చేరి సరఫరా అవుతుండటంతో పలువురు అనారోగ్యం బారిన పడినట్లు వచ్చిన ఫిర్యాదుతో జలమండలి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా పైపులైన్లను, తాగునీటి నాణ్యతను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా అయ్యేలా చూడాలని జలమండలి అధికారులకు తెలిపారు.

కార్మికులకు అండగా ఉంటా...

బాధిత కార్మికుడికి గ్రాడ్యుటీ డబ్బులను అందిస్తున్న కార్మిక సంఘం నాయకుడు రవిసింగ్

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 11: కష్టాల్లో ఉన్న కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని కాలాకాల్‌లో మహాలక్ష్మి ప్రొఫైల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఐదేండ్లుగా కార్మికుడు రాజేంద్ర సెక్యూరిటీగార్డుగా పనిచేశాడు. ఏ కారణం లేకుండా పని నుంచి తొలగించిన యాజమాన్యం అతడికి ఇవ్వాల్సిన గ్రాడ్యుటీ డబ్బులను ఇవ్వడానికి నిరాకరించారు. బాధితుడు కార్మిక నాయకుడు రవిసింగ్ దృష్టికి తేగా.. వెంటనే కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి గ్రాడ్యుటీ, బెనిఫిట్స్ కలిపి రూ.80వేల నగదును ఇప్పించాడు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్ మల్లేశంకు విద్యా ప్రదాత గురు పురస్కార్ అవార్డు

లయన్ మల్లేశంకు అవార్డును అందిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్11: కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్ సత్‌గ్యాన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ లయన్ చింతల మల్లేశంకు విద్యాప్రదాత గురు పురస్కార్-24 అవార్డును ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ అందించింది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు లయన్ చింతల మల్లేశంను ఘనంగా సన్మానించి అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి మాట్లాడుతూ.. లయన్ చింతల మల్లేశం గత మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో విశేష సేవలందించి తల్లిదండ్రుల ఆదరాభిమానాలు పొంది ఎంతో మంది విద్యార్థులను సమాజంలో ఒక మంచి పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. తన పాఠశాలలో విద్యార్థులకే కాకుండా పుట్టిన ఊరులో సేవా కార్యక్రమాలను అందిస్తూ సామాజిక దృక్పథంలో ఇతరులకు స్ఫూర్తినిస్తున్న లయన్ చింతల మల్లేశం అని ప్రశంసించారు. కార్యక్రమంలో మిసెస్ ఫెమినా యు ఎస్ఏ డాక్టర్ సూర్యరేవతి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ నెంబర్ ఏవీరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై.. పలువురికి గాయాలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 11: ఓ ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు సిలిండర్ రెగ్యులేటర్ వద్ద ఒక్కసారిగా గ్యాస్ లీక్ కావడంతో మంటల వ్యాపించాయి. దీంతో ఆ ఇంట్లో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ధర్మేశ్ కథనం ప్రకారం.. దూలపల్లిలోని అయ్యప్పకాలనీకి చెందిన హిందూ(39) తన ఇంట్లో రాత్రి వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో హిందూతో పాటు ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు ఐశ్వర్య, కృష్ణ, మారుతి, బాబు, సోఫానకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారమివ్వగా సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో గెలువు

భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్

కొండాపూర్, సెప్టెంబర్ 11: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దమ్ముంటే రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో గెలువాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలకు ఇవ్వాల్సిన పదవిని పార్టీ మారిన అధికార పార్టీ కాంగ్రెస్ కండువా కప్పుకున్న అరెకపూడి గాంధీకి ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. తాను ప్రతిపక్షంలోనే ఉన్నా అంటున్న గాంధీ దమ్ముంటే వెంటనే పదవికి రాజీనామా చేసి.. ఉప ఎన్నికల్లో గెలిచి పదవిని తీసుకోవాలని సవాల్ విసిరారు. తాను ప్రతిపక్షంలో ఉంటే బీఆర్ఎస్ కండువా వేసుకుని తెలంగాణ భవన్‌కు రావాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుతో పార్టీ మారలేదంటూ అబద్ధాలు మాట్లాడటంపై తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. తనపై నమ్మకంతో గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ బస్తీలు/కాలనీలకు చెందిన ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువజన, సంక్షేమ సంఘాల ప్రతినిధులు బుధవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బస్తీలు/కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ పూజలో పాల్గొన్నారు. కార్పొరేటర్‌లు మంత్రి సత్యనారాయణ, జగన్, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, బొరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెలబాల్‌రెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు పాల్గొన్నారు.

– దుండిగల్,సెప్టెంబర్11

గణేశ్ నిమజ్జన వేడుకలు సామరస్యంగా సాగాలి

కేపీహెచ్‌బీ కాలనీ:టెంపుల్ బస్టాప్‌లో గణనాథుడి పూజలో కేపీహెచ్‌బీ కాలనీ సీఐ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై సుమన్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, కళాకారులు

కేపీహెచ్‌బీ కాలనీ : కేపీహెచ్‌బీ కాలనీలో గణనాథుడి పూజలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, సాయిబాబా చౌదరి, బీఆర్ఎస్ పార్టీ నేతలు

అల్లాపూర్: శ్రీవివేకానందనగర్ రోడ్డు నంబర్-5 బాలగణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్ట పీస్‌మీటింగ్‌లో డీసీపీ సురేశ్‌కుమార్, అధికారులు, నేతలు

కొండాపూర్ : వినాయక నవరాత్రులను పురస్కరించుకుని డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు విగ్రహాల వద్ద పూజల్లో పాల్గొన్న చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి

బాలానగర్ : ఓల్డ్‌బోయిన్‌పల్లిలో లంబోదరుడిని దర్శించుకున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, భక్తులు తదితరులు



బాలానగర్ : ఫతేనగర్‌లో గణపతి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్, భక్తులు



మాదాపూర్ : హఫీజ్‌పేట్‌లోని హనుమాన్ యూత్ అసోసియేషన్ మండప నిర్వాహకుడు కనకమామిడి నరేందర్ గౌడ్‌తో కలిసి గణనాథునికి పూజలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అవినాశ్‌రెడ్డి

దుండిగల్ : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, సారేగూడెంలోని జయరాం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

బాలానగర్ : బాలానగర్‌లో వినాయకుడిని దర్శించుకున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, భక్తులు



మూసాపేట: డివిజన్ పరిధి యువజన సంఘం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకుడి దర్శించుకున్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావన్‌కుమార్ తదితరులు

జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 11 : గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా అన్ని వర్గాలు పరస్పరం సహకారం అందించుకోవాలని బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ సూచించారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వినాయక మండపాల నిర్వాహకులు, పలు మసీదు కమిటీల సభ్యులతో పీస్ మీటింగ్ జరిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జనాలు, మిలాదు నబీ పండుగ ఇబ్బందులు లేకుండా జరుపుకోవాలన్నారు. పోలీసులు, అధికారుల సూచనల మేరకే కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్వహణలో ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ హన్మంతరావు, సీఐ క్రాంతికుమార్, పలువురు మతపెద్దలు పాల్గొన్నారు.

దూరవిద్య ఎంసీఏ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 11: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంసీఏ మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్ పరీక్షలను ఈనెల 20 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను వ